సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



'ఆడుదాం ఆంధ్ర'తో క్రీడాభివృద్ధి

ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు క్రీడల అభివృద్ధికి దోహదపడతాయని ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. 8లో



విత్తన శుద్ధితో మంచి దిగుబడి

వరి సాగులో విత్తన శుద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 8లో



సీతారాముల కల్యాణం

గోపినాథపట్నంలో మంత్రి కొట్టు సత్యనారాయణ సారథ్యంలో ముక్కోటిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం జరిపించారు. 8లో

న్యూస్‌రీల్

క్రీస్తు బోధనలతో శాంతి



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: క్రీస్తు బోధనలతో ప్రపంచ మానవాళికి శాంతి కలుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఆదివారం రాత్రి తణుకు మండలంలోని పలు చర్చిల వద్ద జరిగిన ఆరాధన, ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా దేవుడు శక్తిని ప్రసాదించాడని, ఆయన కృప ప్రజలందరికీ ఉండాలని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించే శక్తిని ప్రభుత్వానికి అందించాలని ప్రతిఒక్కరూ ప్రార్థించాలని కోరారు. చర్చిల్లో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తణుకు మండలంలోని తేతలి, మండపాక, పైడిపర్రు, వేల్పూరు, దువ్వ, కొమరవరం, ముద్దాపురం, కోనాల తదితర గ్రామాల్లో వేడుకలకు ఆయన హాజరయ్యారు. మండపాక చర్చిలో మంత్రి కారుమూరిని మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లా ప్రజలకు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియజేశారని, క్రీస్తు మార్గం ఆదర్శనీయమన్నారు. ఆయన చూపిన శాంతి మార్గంలో నడవాలని ఆకాంక్షించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

భీమవరం: క్రీస్తు బోధనలు అనుసరణీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. పట్టణంలోని బేతనీపేట లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం, తోటి వారిపై ప్రేమ, దయ, జాలి గుణం కలిగి ఉండాలని ఆయన అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ కె.ఎఫ్ పరదేశిబాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, కె.అనుపమ, ఎం.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ దాతలకు ప్రత్యేక గుర్తింపు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయానికి విరాళాలనిచ్చే దాతలకు తగిన గుర్తింపునిచ్చేలా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా దాతలకు అందించేందుకు ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేశారు. వాటిపై సేవల వివరాలు, దాతలు పాటించాల్సిన నియమాలను వివరించారు. ఇకపై నిత్యాన్నదానం, గోసంరక్షణ, ప్రాణదాన, వృక్ష ప్రసాదం, విమాన గోపుర స్వర్ణమయం, స్వామి, అమ్మవార్ల అలంకరణలకు అలాగే బంగారం, వెండి ఆభరణాలు, వస్తువులు విరాళంగా అందించే దాతలకు ఈ ధ్రువీకరణ పత్రాలు అందించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. దాతలు అందించిన విరాళాల మొత్తం ఆధారంగా అంతరాలయ దర్శనం, పలు రకాలు సేవల్లో పాల్గొనే అవకాశం వారికి కల్పిస్తామన్నారు. దాత కాకుండా మరో ఐదుగురు సేవల్లో పాల్గొనవచ్చని, 12 ఏళ్లలోపు వయసున్న వారు ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. అయితే దాతలు సేవలో పాల్గొనే తేదీకి 15 రోజుల ముందు ఆలయ కార్యాలయం సెల్ 90375 67894లో తెలియజేయాలని సూచించారు. కార్డులో ధ్రువీకరించిన సభ్యులను మాత్రమే అనుమతిస్తామని, దాతలు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ముక్కోటి ఏకాదశి, బ్రహ్మోత్సవాలు, ఇతర పర్వదినాల్లో అంతరాలయ దర్శనానికి అనుమతించమని, దాతకు అందించిన ధ్రువీకరణపత్రం ఎవరికీ బదిలీ చేయడానికి కుదరదని స్పష్టం చేశారు.

2.27 లక్షల టన్నుల ధాన్యం సేకరణ


ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో 251 ఆర్‌బీకేల ద్వారా ఇప్పటివరకు 46,799 మంది రైతుల నుంచి రూ.495.84 కోట్ల విలువైన 2.27 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. ఈ మేరకు 34,041 మంది రైతుల ఖాతాలకు రూ.367.08 కోట్లు జమచేశామన్నారు.



ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో క్రిస్మస్ క్యారల్స్



ఏలూరు : విద్యుత్ కాంతుల్లో ఏలూరు బిషప్ హౌస్ చర్చి



ఏలూరు : పశువుల పాక సెట్టింగ్

క్రిస్మస్ కాంతులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. క్రైస్తవ మందిరాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. చర్చిలు విద్యుత్ దీపాలు, స్టార్స్‌తో కాంతులీనుతున్నాయి. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలియజేస్తూ పశువుల పాకలు ఏర్పాటుచేశారు. రంగులు, పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, క్రిస్మస్ క్యారల్స్ వంటి కార్యక్రమాలు జరిగాయి. – సాక్షి నెట్‌వర్క్

అందరికీ ఆరోగ్య భాగ్యం

ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారు.. ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కుగా వైద్యరంగంలో విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.. ప్రజల చెంతకే వైద్యం అందించేలా ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అపర సంజీవనిలా నిలిచిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను మరింత విస్తృతం చేసి వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. మొత్తంగా 2023లో అందరికీ ఆరోగ్య భాగ్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

2023 రౌండప్ – వైద్యం



పాలకొల్లు మండలం లంకలకోడేరులో పీహెచ్‌సీ నూతన భవనం

సాక్షి, భీమవరం: జిల్లాలో ఒక జిల్లా ఆరోగ్యకేంద్రం, మూడు సీహెచ్‌సీలు, ఐదు ఏరియా ఆస్పత్రులు, 34 పీహెచ్‌సీలు, 18 యూపీహెచ్‌సీలు, 535 సచివాలయ సబ్ సెంటర్లు ఉన్నాయి. రోజుకు 15,285 వరకు ఓపీ నమోదవుతుంది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య రంగంలో వైఎస్సార్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చింది. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధితో పాటు మౌలిక వసతులు కల్పిస్తోంది. ఈ పథకం కింద ఈ ఏడాది సుమారు రూ.7.50 కోట్ల వ్యయంతో ముదునూరు, మంచిలి, లంకలకోడేరులో ఆధునిక వసతులతో నూతన భవనాలు నిర్మించగా, మేడపాడు, ఆచంట వేమవరం, కాళ్లలో పీహెచ్‌సీల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఈ ఏడాది గ్రామగ్రామాన వైద్యశిబిరాలు నిర్వహిస్తూ 6.24 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. వీరిలో జనరల్ ఓపీ 4 లక్షల వరకు ఉండగా మిగిలిన వారు బాలింతలు, గర్భిణులతో పాటు బీపీ, షుగర్, టీబీ, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా రక్తహీనత, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వైద్యసాయం అందించారు.

ప్రజారోగ్యమే పరమావధి

- పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా
- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- జగనన్న సురక్షతో ప్రజల చెంతకే వైద్యం
- జిల్లాలో 447 శిబిరాల ద్వారా 3.54 లక్షల మందికి సేవలు
- 43,963 మందికి ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు
- 57,644 మందికి ఆరోగ్య ఆసరా
- 2,006 మందికి కంటి శస్త్రచికిత్సలు

ఐదింతలు అందగా..

ప్రస్తుతం ఒక్కో కుటుంబానికి ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఈ సాయాన్ని సీఎం జగన్ రూ.25 లక్షలకు పెంచారు. గతంలో అందించే 1,059 చికిత్సల సంఖ్య (ప్రొసీజర్ల)ను 3,257కి పెంచారు. ఆరోగ్య సేవలు చేరువ చేసేలా ప్రత్యేక యాప్ రూపొందించి స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. విస్తరించిన చికిత్సలు, క్యూఆర్ కోడ్, కొత్త ఫీచర్లతో రూపొందించిన 5,82,565 కొత్త ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను జిల్లాలోని లబ్ధిదారులకు అందజేస్తున్నారు. క్యాన్సర్ లాంటి ఖరీదైన వ్యాధుల చికిత్సకు పరిమితి లేకుండా ప్రభుత్వం సాయం అందిస్తోంది. జిల్లాలో 42 ప్రభుత్వ, 30 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారు. కంటి వెలుగు పథకం కింద కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేయించడం, కళ్లజోళ్ల పంపిణీ చేస్తున్నారు.

యజ్ఞంలా జగనన్న సురక్ష

ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన వైద్యసాయం అందించేందుకు ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. సెప్టెంబర్ 30 నుంచి 45 రోజులపాటు సాగిన కార్యక్రమంలో విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 447 వైద్యశిబిరాలు నిర్వహించారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 132 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది 3.54 లక్షల మంది ప్రజలకు వైద్యసేవలు అందించారు. 3.46 లక్షల మందికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 1,678 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సల కోసం సిఫార్సుచేశారు. వచ్చే ఏడాది రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు
43,963 మందికి
వ్యయం రూ. 99.15 కోట్లు

ఆరోగ్యశ్రీ ఆసరా
57,644 మందికి
రూ. 142 కోట్ల సాయం

కంటి శస్త్ర చికిత్సలు
2006 మందికి
వ్యయం రూ. 1.50 కోట్లు

కళ్లజోళ్ల పంపిణీ
16,361 మందికి
వ్యయం రూ. 31.10 లక్షలు



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డులు



గరగపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం (ఫైల్)

ఆరోగ్య భద్రత.. ఆర్థిక చేయూత

- జననీ సురక్ష యోజన కింద డెలివరీ అయిన వెంటనే 6,276 మంది గర్భిణులకు రూ.62.76 లక్షలు అందించారు.
- 845 మంది టీబీ బాధితులకు పోషకాహారం నిమిత్తం రూ.25.35 లక్షలు అందజేశారు.
- 1,185 మంది ఎయిడ్స్ బాధితులకు పింఛన్ సాయంగా రూ.1.96 కోట్ల పంపిణీ చేశారు.
- 577 మంది లెప్రసీ బాధితులకు రూ.10.39 కోట్లు అందజేశారు.
- థలసేమియా, పక్షవాతం, కిడ్నీ, గుండె, లివర్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 3,275 మందికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పింఛన్ సాయంగా రూ.13 కోట్లు అందజేశారు.

ఆటపాక కేంద్రం అందాలు అద్భుతం



పక్షుల విశేషాలు తెలుసుకుంటున్న డీఐజీ

కైకలూరు : కొల్లేరు పక్షుల అందాలు అద్భుతంగా ఉన్నాయని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ కితాబిచ్చారు. కుటుంబసమేతంగా ఆటపాక పక్షుల కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. కేంద్రంలో పక్షి నమూనా మ్యూజియంలో పక్షుల విశేషాలు, కొల్లేరు భౌగోళిక నైసర్గిక స్వరూపాన్ని డిప్యూటీ రేంజర్ జయప్రకాష్ డీఐజీకి వివరించారు. పక్షుల సంరక్షణకు అటవీశాఖ చేపట్టిన చర్యలను డీఐజీ అభినందించారు. అంతకుముందు డీఐజీ కుటుంబసభ్యులు కొల్లేటికోట పెద్దింట్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు డీఐజీ దంపతులను సత్కరించారు. అలాగే ఆటపాక పక్షుల కేంద్రాన్ని విశ్రాంత ఐఎఫ్ఎస్ జేఎస్ఎన్ మూర్తి కుటుంబ సమేతంగా సందర్శించారు. కైకలూరు సర్కిల్, టౌన్ సీఐలు బి.కృష్ణకుమార్, ఆకుల రఘు, మండవల్లి ఎస్సై పి.రామకృష్ణ, ఫారెస్ట్ బీటు ఆఫీసర్ కె.వెంకన్న ఉన్నారు.

మద్దిలో హనుమద్ వ్రతం



పూజలు చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆదివారం హనుమద్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దీక్షాదారులు స్వామి సన్నిధిలో ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి క్షేత్రం.. భక్త జన సంద్రం



చినవెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సైతం వేలాది మంది భక్తులు స్వామిని దర్శించారు. వరుస సెలవులు కావడంతో క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగడంతో ఆలయ పరిసరాలు కళకళలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివెట్టి మండపం, జంటగోపురాలు, తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. పార్కింగ్ ప్రదేశాలు, ఘాట్ రోడ్లు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. సుమారు 25 వేల మంది భక్తులు స్వామిని దర్శించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం కూడా ఇలాగే రద్దీ కొనసాగవచ్చని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



వేద ఆశీర్వచనాన్ని పొందుతున్న మాజీ ఐఏఎస్‌లు

శ్రీవారి సేవలో మాజీ ఐఏఎస్‌లు

శ్రీవారి క్షేత్రాన్ని మాజీ ఐఏఎస్‌లు వసుదా మిశ్ర, రాజీవ్ రంజన్ మిశ్ర, కౌషిక్ దర్శించి, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, దేవస్థానం ఏఈఓ మెట్టుపల్లి దుర్గారావు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

సంక్షేమ పాలనతోనే పార్టీలో చేరికలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత జవ్వాది హరిబాబుతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఉంటున్నాయని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆదివారం టీడీపీ, జనసేన పార్టీల నుంచి తణుకు మున్సిపాలిటీ, తణుకు, ఇరగవరం మండలాలకు చెందిన 500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరినీ కంటికి రెప్పలా చూసుకుంటామని, ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలవవచ్చని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ముఖ్యంగా ఇరగవరం మండలం కత్తవపాడు నుంచి టీడీపీ సీనియర్ నేత జవ్వాది హరిబాబు వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమని అన్నారు.

ఈనెల 27న అంబటి రాయుడు రాక

ఈనెల 27న అత్తిలిలో వైఎస్సార్, వంగవీటి మోహన రంగా విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు రానున్నారని, అదే రోజు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, యువనేత కారుమూరి సునీల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్లు నత్తా కృష్ణవేణి, బుద్దరాతి భరణిప్రసాద్, అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీలు ఎం.అన్నపూర్ణాదేవి, అడ్డాల జానకి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, మండల మహిళాధ్యక్షులు కాకర్ల విశాలాక్షి, మెట్ల కిరణ్మయి పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

దెందులూరు: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పిలుపునిచ్చారు. ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా దెందులూరు గ్రామస్తులతో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేయించుకోవాలని, అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే మరణించిన వారి ఓట్లను తొలగించడం, ఓటర్ల అభ్యర్థన మేరకు మార్పులు, చేర్పులు చేయడం వంటివి చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కైకలూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కైకలూరు మండలం రామవరం ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం రాజులపేటకు చెందిన పెనుమాల భాగ్యరావు(45) ట్రాక్టర్ ఓనర్‌గా పనిచేస్తున్నాడు. రామవరంలో ట్రాక్టర్ బాకీ నిమిత్తం వచ్చాడు. గ్రామంలో వాహనం ఢీకొనడటంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. కుమారుడు సాల్మన్ ఫిర్యాదుపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్రిస్మస్ పర్వదినం రోజుల్లో ఘటన జరగడంతో కుటుంబంలో విషాదం అలముకుంది.

భక్తాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



రామ భక్తాంజనేయ స్వామి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

వీరవాసరం: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నందమూరు గరువులోని శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షిక మహోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఆంజనేయ స్వామి కరుణ, కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. గ్రామస్తులంతా కలిసి ఆంజనేయస్వామి మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత శ్రీరామ భక్తాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ ప్రారంభ సూచికగా శాంతికపోతాలను గాలిలోకి ఎగురవేశారు. శ్రీస్వామివార్ల ఊరేగింపు మేళతాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. పలు జానపద, సాంస్కృతిక ప్రదర్శనలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్పులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు (బాబు), సీఐ వై.సత్యకిషోర్, కొప్పినీడి శ్రీనివాసరావు, మేకల వెంకట చలపతి, కావలి ఖుషి కేశ దామోదర్ రావు, వడ్డీ కనకదుర్గ ప్రసాద్, నక్కెళ్ల అప్పారావు, కొప్పినీడి శ్యామలరావు, ఎస్‌ఐ పి.రమేష్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రతో క్రీడాభివృద్ధి

- ఏలూరులో భారీ ఎత్తున 3కే రన్
- రేపు క్రీడా పోటీలు ప్రారంభం



కిట్లతో కలెక్టర్, ఎస్పీ, జేసీ



3 కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు



3 కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరి ప్రశాంతి, జేసీ లావణ్యవేణి



3 కే రన్ విజేతలకు మెమెంటో, చెక్ అందచేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు క్రీడల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ అన్నారు. ఆదివారం ఏలూరులో 3 కె రన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యం వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు చేపట్టారన్నారు. ఈ పోటీలు క్రీడాకారులనే కాక ప్రజలకు సైతం ఆరోగ్యం పట్ల చైతన్యం కలిగిస్తాయన్నారు. ఈ నెల 26 నుంచి గ్రామ, వార్డు స్థాయిలో పోటీలు అట్టహాసంగా ప్రారంభమవుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షా 47 వేల మంది ఈ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇందుకోసం క్రీడాపరికరాలు, 320 ఆట స్థలాలను సిద్ధం చేశామన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ అంశాల్లో పోటీ పడేందుకు 14,354 టీమ్స్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయన్నారు. మొత్తంగా 7195 మ్యాచ్‌లను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. నేడు పిల్లలు, యువత టీవీ, మొబైల్ తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌పై ఆసక్తి పెంచుకుని శారీరక శ్రమతో కూడిన ఆటలకు దూరమవుతున్నారని గుర్తు చేశారు. అందువల్ల ఈ పోటీల గురించి యువత, ప్రజల్లో ఆసక్తి రేపేందుకు 3 కె రన్ నిర్వహించామన్నారు. 15 ఏళ్ళు పైబడిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఎస్పీ.డి మేరీప్రశాంతి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక పటుత్వంతో పాటు ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. పోటీల గురించి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి వివరిస్తూ విజేతలను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో మొదట మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.5 లక్షలు, రూ.3.లక్షలు, రూ.2 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీనికి ముందు వట్లూరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి ఏలూరు ఇండోర్‌స్టేడియం వరకూ చేపట్టిన 3 కె రన్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాకారులు, అధికారులు క్రీడా దుస్తులు వేసుకుని ఈ రన్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలో పాల్గొన్న మహిళల విభాగంలో వరుస స్థానాల్లో నిలిచిన లక్ష్మీహర్ష, కె.గోర్, వనపాల సత్యపూజిత, పురుషుల విభాగంలో డి.విష్ణువర్ధన్, జి వెంకట్‌లోకేష్, డిజయరాజతకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

పెనుగొండ: ప్రేమించిన అమ్మాయిని మరచిపోలేక పెనుగొండ మండలం వెంకట్రామపురం గ్రామానికి చెందిన గరగ సీతారామ్ గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి పెనుగొండ ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం వెంకట్రామపురానికి చెందిన గరగ రాజేశ్వరి, సత్యనారాయణల కుమారుడు ఎంఎల్‌టీ చదువుతూ నల్లజర్లలో ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. అదేప్రాంతంలో ఓ అమ్మాయితో పరిచయం కాగా వారు ప్రేమించుకొన్నారు. అయితే పెద్దలు అందుకు అంగీకరించలేదు. సీతారామ్ ఆ అమ్మాయిని మరచిపోలేక ఈ నెల 20న రాత్రి 8 గంటల సమయంలో ఏటీఎంకు వెళ్లి డబ్బులు తీసుకు వస్తానని చెప్పి సిద్ధాంతం వెళ్లి రాత్రి 1 గంట సమయంలో ఇంటికి ఫోన్ చేసి అమ్మాయిని మరచి పోలేకపోతున్నానని, మోటార్ సైకిల్ సిద్ధాంతంలోనే వదిలి వేసి విజయవాడ వెళ్లిపోతున్నట్లు చెప్పారు. సిద్ధాంతం వెళ్లి వెతగ్గా మోటార్‌సైకిల్ దొరికింది. సీతారామ్ ఎక్కడా లేకపోవడంతో 20వ తేదీ నుంచి వెదుకుతున్నారు. ఈ తరుణంలో ఆదివారం సాయంత్రం సిద్ధాంతంలో మృతదేహం లభ్యం కావడంతో వెళ్లి చూడగా సీతారామ్ మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని చక్రదేవరపల్లి శివారు ఎర్రకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నీటిలో మృతదేహం తేలియాడటంతో సమాచారం అందుకున్న లక్కవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ముదురు పచ్చ రంగు చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 40 సంవత్సరాల ఉండవచ్చన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



మొగల్లులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

పాలకోడేరు: అతి వేగంగా వస్తున్న ఇన్నోవా కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేద. భీమవరం రూరల్ మండలం నరసింహపురం గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఆదివారం ఇన్నోవా కారులో వరిఘేడు దానమ్మ గుడికి వెళ్లి తిరిగి వస్తూ మొగల్లు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. స్తంభం విరిగిపోయి కారు మీద పడింది అందులో ఉన్న యువకులు సురక్షితంగా బయటపడ్డారు.

గోపినాథపట్నంలో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసభ్యులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సారథ్యంలో ముక్కోటి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. రుత్వికులు, అర్చక స్వాములు, వేద పండితులు అత్యంత వైభవంగా కల్యాణం జరిపించారు. అర్చక అకాడమీ డైరెక్టరు వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి దంపతులు, కొట్టు మురళీ దంపతులు, కొట్టు తాతాజీ దంపతులు, కొట్టు విశాల్ దంపతులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. తాడేపల్లిగూడెం భజన సమాజం వారిచే భజనలు నిర్వహించారు. విజయవాడ నృత్య భక్త బృందం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించింది. ద్వాదశి సందర్భంగా భారీ అన్న సమారాదన జరిపారు. తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపద్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, జిల్లా రైసు మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రామరాజు, తాలూకా రైసు మిల్లర్స్ అసోషియన్ అధ్యక్షుడు బూరాడ శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవల్లి నాగేంద్ర, కనకదుర్గమ్మ ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్ధనరావు, సీపీఎఫ్ కమిటీ మెంబరు కర్రి భాస్కరరావు, మార్కెటు కమిటీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భారీ అన్న సమారాధన జరిగింది. నేడు శ్రీరామ సామ్రాజ్యపట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున తెల్లవారుజాము నుంచే ధూప, దీప, నైవేద్యాలతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న పాటెమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

నూజివీడు: మండలంలోని తూర్పుదిగవల్లిలోని నల్లచెరువులో ఆదివారం పూర్తిగా పాడైపోయిన స్థితిలో మృతదేహం వెలుగుచూసింది. స్థానికులు కొందరు చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లగా మృతదేహం నీటిలో తేలుతూ కనిపించడంతో వెంటనే పోలీసులకు తెలిపారు. రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. గుర్తు పట్టడానికి వీలులేని విధంగా మృతదేహం తయారైంది. మృతదేహానికి ఉన్న షర్టు జేబులో గుర్తింపు కార్డును బట్టి తూర్పు దిగవల్లికి చెందిన కాటూరి శేషగిరిరావు(37)గా గుర్తించారు. అతను నూజివీడులో మంగలిషాపులో పని చేస్తూ జీవిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ 15 ఏళ్ల క్రితమే దంపతులిరువురూ విడిపోయారు. భార్య పిల్లలతో జగ్గయ్యపేటలో ఉంటోంది. 20 రోజుల క్రితమే చెరువులో పడి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నృత్యం.. అద్భుతం



ప్రదీప్ విదాటే, కథక్



హనీ ఉన్ని కృష్ణన్, మోహినీ అట్టం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 22 నుంచి ఏలూరులో ఉత్సాహభరితంగా జరుగుతున్న అభినయ నృత్య భారతి 28వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వార్షికోత్సవాల్లో భాగంగా శివగోపాల్ లునాని, బ్రిజ్ గోపాల్ లునాని స్మారక జాతీయ నృత్యోత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన అంతర్జాతీయ నృత్య కళాకారులు తమ రాష్ట్రాలకు చెందిన వివిధ నృత్య రీతులను ప్రదర్శించి నగర ప్రజలను అలరించారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో జరిగిన ఈ నృత్యోత్సవాల్లో పూనెకు చెందిన ప్రదీప విదాటే కథక్ నృత్యం ప్రదర్శించారు. నాగపూర్‌కు చెందిన డాక్టర్ హనీ ఉన్ని కృష్ణన్ మోహినీ అట్టం, అనంతపురానికి చెందిన సోమనాథ్ భరద్వాజ్ కూచిపూడి నృత్యం, రాజమండ్రికి చెందిన ఎం.పరిమళ హరిప్రియ భరత నాట్యం, గుడివాడకు చెందిన పాదర్తి యశస్విని కూచిపూడి, విజయవాడకు చెందిన టీ. జ్యోత్స్న ఆంధ్ర నాట్యం ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా అలరించారు. ఆయా నృత్య ప్రదర్శనలు చేసిన నృత్య కళాకారులకు అభినయ నృత్య భారతి సంస్థ నృత్య కౌముది అవార్డులను ఇచ్చి సత్కరించింది. అంతకు ముందు కానాల గురుమూర్తి, వెంకట నారాయణమ్మ స్మారక జాతీయ స్థాయి కూచిపూడి బృంద నృత్య పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు నృత్య కళాకారులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమాలను అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డీ హేమసుందర్ పర్యవేక్షించారు.

విత్తన శుద్ధితో మంచి దిగుబడి



వీరవాసరం మండలంలో దాళ్వా వరి నారుమడికి దమ్ము చేస్తున్న దృశ్యం

భీమవరం: సార్వా వరి మాసూళ్ల సమయంలో తుపాను కారణంగా దెబ్బతిన్న రైతులు దాళ్వాపై దృష్టిపెట్టారు. భారీ వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా నిలబడడంతో దాదాపు సార్వా మాసూళ్ల పూర్తికావడంతో రైతులు దాళ్వాపై దృష్టిపెట్టారు. వరి సాగులో విత్తన శుద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో దాళ్వా పంటలో సుమారు 2.45 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. వరి నారు వేయడానికి ఎకరాకు 20 కిలోల వరకు విత్తనాలు అవసరమవుతాయి.

విత్తనాలు సేకరించడం ఎలా

పురుగులు, తెగుళ్ల ఆశించని పొలం నుంచి విత్తనాన్ని సేకరించుకోవాలి. రైతులు తమ సొంత విత్తనాన్నే వాడుకుంటే పంట కోత కోసిన తరువాత విత్తనాలతో పాటు కలిసిపోయిన మట్టి, శిలీంధ్ర బీజాలు, పురుగు తుట్టెలను తీసివేసి శుభ్రం చేసి నిలువచేసుకుని వాడుకోవాలి. బయట విత్తనాన్ని కొనుగోలు చేసే సమయంలో విత్తన శుద్ధి చేసి ఉందా లేదా నిర్ధారించుకోవాలి. కొనుగోలుచేసిన విత్తనానికి సంబంధించిన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాల మొలక శాతం తప్పనిసరిగా పరీక్షించుకోవాలి.

వరి విత్తనాల శుద్ధి ఇలా

ఎక్కువ మంది రైతులు సొంతంగా విత్తనాలను పండించుకోవడం లేదా, తోటి రైతుల నుంచి విత్తనాలను సేకరించుకోవడం చేస్తుంటారు. ఆ విత్తనాలతో పాటు కొన్ని తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలు, బ్యాక్టీరియా, వైరస్ వంటివి పైరును ఆశించి పంటకు తీవ్రమైన నష్టాన్ని కలుగచేస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో నాణ్యమైన విత్తనమైనా నేల నుంచి, వివిధ రకాల పురుగుల నుంచి తెగుళ్ల ఆశించి పంటను నష్టపరుస్తుంటాయి. అందువల్ల పంటను తొలిదశలోనే రక్షించుకోవడానికి సిఫార్సు చేసిన శిలీంధ్ర నాశినులతో, పురుగు మందులు లేదా జీవ శిలీంధ్ర నాశినులతో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. ఈ మందులు పొడి, ద్రవ రూపంలో, కాన్సన్‌ట్రేట్స్ రూపంలో మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి.

విత్తన శుద్ధి పద్ధతులు

పొడి విత్తన శుద్ధి కోసం డ్రమ్ములలో మూడింట రెండు వంతులు విత్తనం వేసి సిఫార్సు చేసిన మోతాదులో మందు వేసి బాగా తిప్పితే విత్తనానికి మందు పట్టుకుంటుంది. కొన్ని రకాల విత్తనాలకు జిగురు, బెల్లం ద్రావణం, చిక్కటి గంజి ద్రావణం వంటివి కలపడం వల్ల మందు బాగా పట్టుకొని విత్తన శుద్ధి మందు ఒక రక్షణ కవచంలాగా ఏర్పడి చీడ పీడల నివారణ సాధ్యమవుతుంది.

తడి విత్తనశుద్ధి ఇలా

ముఖ్యంగా వరి విత్తనశుద్ధికి తగినంత నీటిని తీసుకొని ఆ నీటిలో సిఫార్సుచేసిన మందులు కలుపుకొని ఆ నీటిలో విత్తనాలను నానబెట్టుకోవడం ద్వారా చీడ పీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చు.

జీవ శిలీంద్ర నాశినులతో విత్తన శుద్ధి

కొన్ని రకాల జీవ శిలీంద్ర నాశినులతో ముఖ్యంగా ట్రైకోడెర్మా విరిడి, ట్రైకోడెర్మా హర్జియానం సూడోమోనాస్ వంటి వాటితో విత్తన శుద్ధి చేయడం వల్ల ఇవి తమ సంతతిని భూమిలోనే అభివృద్ధి చేసుకొని తెగుళ్ల కలుగచేసే శిలీంద్రాలను నాశనం చేయడమేగాక పంట చివరి వరకు రక్షణ కల్పిస్తాయి. ఈ మందులు భూమిలోనే వృద్ధి చెంది తరువాత వేసే పంటలకు కూడా ఉపయోగపడతాయి. వీటి మోతాదు కిలో విత్తనానికి 8 నుంచి 10 గ్రాముల వరకు వాడుకోవాలి.

విత్తన శుద్ధి ద్వారా పంటకు రక్షణ

వరి పండించే రైతులు విత్తన శుద్ధి ద్వారా పురుగు మందుల ఖర్చు తగ్గడమేగాక అధికదిగుబడి సాధించడానికి అవకాశముంటుంది. దాళ్వా పంట నారుమళ్లకు సన్నద్ధమవుతున్న రైతులు తప్పని సరిగా విత్తన శుద్ధిపై దృష్టిపెట్టాలి.

డాక్టర్. ఎంవీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాధ్యక్షునిగా రాంబాబు


ములకాల రాంబాబు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం తాడేపల్లిగూడెం మండలాధ్యక్షునిగా ములకాల రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. అలాగే యువజన విభాగం తాడేపల్లిగూడెం పట్టణాధ్యక్షునిగా చిటకన ప్రసాద్, పెంటపాడు మండలాధ్యక్షునిగా కొవ్వూరి విజయభాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, పార్టీ యువజన నాయకుడు కొట్టు విశాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో స్వర్ణ పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన 21వ ఆల్ ఇండియా ఇంటర్ స్కూల్ సీనియర్ కరాటే ఫెడరేషన్ కప్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారు. స్థానిక షీకో షోటోకాన్ అడ్వాన్స్ కరాటే డూకి చెందిన ఎస్‌కే లీన 11 సంవత్సరాల కటా విభాగంలో స్వర్ణ పతకం, కుమిటీలో కాంస్య పతకం పొందింది. ఏడు సంవత్సరాల విభాగంలో కటాలో ఎస్‌కే నసీరా కాంస్య పతకం సాధించినట్లు కోచ్ ఎ.శ్యామ్‌బాలాజీ ఆదివారం తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన పోటీల్లో 10 రాష్ట్రాల నుంచి 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు


తాడేపల్లిగూడెం: హనుమత్ వ్రతం పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ కృష్ణ యోగా ధ్యాన మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస తిరుప్పావై, హనుమంతుని అష్టోత్తర శతనామాలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు మోహనరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం: క్రిస్మస్ ముందస్తు వేడుకలను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన బోడపాడు శివారు బిళ్లగుంట గ్రామంలో పాస్టర్ ఏసురత్నం చర్చిలో ఆదివారం పేదలకు దుస్తులు, రగ్గులు, పండ్లు పంచారు. క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్, రీజియన్ చైర్మన్ మదన్మోహన్ అగర్వాల్, రీజియన్ చైర్మన్ సన్నిధి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరియర్స్ చెల్లించాలి


సమావేశమైన సీనియర్ సిటిజన్లు

తాడేపల్లిగూడెం: ప్రభుత్వం బకాయి ఉన్న డీఏలు, పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో జరిగిన స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం కోరింది. బి.హరికుమార్ అధ్యక్షత వహించారు. పెన్షనర్లు అందరూ జనవరి ఒకటో తేదీ 2024 నుంచి ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్స్ అందించాలని కోరారు. ప్రత్తి రామకృష్ణ, ఐవీ ప్రసాదరాజు, వంగపండు రామ్మోహన్, కె.తాతారెడ్డి, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు


బయల్దేరి వెళ్తున్న ప్రయాణికులు

తాడేపల్లిగూడెం: అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం గూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సు ఆదివారం రాత్రి బయలుదేరి వెళ్లింది. సూపర్ లగ్జరీ వీడియో కోచ్ 25వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, 26వ తేదీన శ్రీపురం తర్వాత పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం వెళుతుంది. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న తర్వాత 27వ తేదీ ఉదయం గూడెం చేరుకుంటుందని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు.

పూర్తయిన రహదారి నిర్మాణం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని మహాలక్ష్మీ నగర్ – టీటీడీ కళ్యాణ మండపం రహదారి పూర్తయింది. ఈ ఏడాది ఆగస్టు 4వ తేదిన ఏరియా ప్రభుత్వాసుపత్రి వద్ద సీసీ రోడ్డు, మహాలక్ష్మీ నగర్ – టీటీడీ కళ్యాణ మండపం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఏరియా ప్రభుత్వాసుపత్రి చెట్లు రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. తాజాగా మహాలక్ష్మీనగర్ – టీటీడీ కళ్యాణ మండపం బీటీ రోడ్డును రెండు లైన్లుగా రహదారిగా అధికారులు అభివృద్ధి చేశారు. గత కొంతకాలంగా ఈ రహదారి నిర్మాణానికి నోచుకోక వాహనదారులు అనేక అవస్థలు ఎదుర్కొంటూ వచ్చారు. ప్రధానంగా మహాలక్ష్మీనగర్ ఆదిత్య కళాశాల ఎదురుగా నుంచి ఇందిరా టవర్స్ వరకు ఒక మోస్తారు వర్షం కురిస్తే మోకాలు లోతు నీరు చేరుతుంది. ఈ నీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగించవలసి వచ్చేది. అదే పరిస్థితి ఇటీవల మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నెలకొంది. అయితే, అప్పటికే రోడ్డు ఎత్తు పెంచడంతో కొంత వాహనదారులకు ఉపశమనం లభించింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మహాలక్ష్మీనగర్ – టీటీడీ కళ్యాణ మండపం రహదారిని రెండ్రోజుల్లోనే పూర్తి చేశారు. దీంతో ఈ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా, ఇందిరా టవర్స్ కూడలి ప్రాంతంలో నాలుగు వైపులా స్పీడ్ బ్రేకర్లను నిర్మించడంతో వాహనాల వేగానికి బ్రేక్ వేసినట్లయింది. ఏదేమైనప్పటికీ, ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రహదారి నిర్మాణంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ (ఫైల్ ఫొటో), మహాలక్ష్మీ నగర్ నుంచి టీటీడీ కళ్యాణ మండపం వరకు పూర్తయిన రోడ్డు

హనుమంతునికి సింధూర పూజ

పెంటపాడు: కె.పెంటపాడు బైరాగి మఠంలో వేంచేసి యున్న ఆంజనేయస్వామి, గోపాల స్వామి వార్ల ఆలయంలో ఆదివారం సింధూర పూజలు వైభవంగా నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేక పూజలుచేసి స్వామివారిని అలంకరించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకోగా, పులిహోర ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి పాల్గొన్నారు.

బైరాగిమఠంలో ధనుర్మాస పూజలు

పెంటపాడు: కె.పెంటపాడు బైరాగిమఠంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ప్రాతకాల అర్చనలు, సుప్రభాత సేవ, సహస్రనామార్చనలు, బాలభోగం, అభిషేకాలు నిర్వహించారు. హరిదాసులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఫిట్ పర్సన్ శివశంకర్ ఆధ్వర్యాన ఆలయ ప్రధానార్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉండాలి

తణుకు అర్బన్: పేదవర్గాలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. తణుకు 18, 19 వార్డులకు సంబంధించి ఆదివారం కప్పల వెంకన్న సెంటర్ సమీపంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న అందిస్తున్న పారదర్శక పాలనకు ప్రజానీకమంతా వైఎస్సార్‌సీపీకి కట్టుబడి ఉండాలన్నారు. ముఖ్యంగా అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం ఉన్నత విద్యనభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. ముందుగా సచివాలయం వద్ద సంక్షేమ పట్టికను ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జీసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, సప్పా బలరామకృష్ణ, కొమ్మోజు రామకృష్ణ, టి.సృజన, న్యాయవాది బలిజేపల్లి రవిశంకర్, ఫహీమా పాల్గొన్నారు.

అయ్యప్ప బిక్షకు హాజరు

స్థానిక తుమ్మలపల్లి సత్రంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మండపంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, గాయత్రి దేవి దంపతుల నిర్వహించిన కార్యక్రమంలో కారుమూరి సునీల్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాలధారులకు ఏర్పాటు చేసిన బిక్షలో సునీల్‌కుమార్ మాలధారులకు స్వయంగా వడ్డించారు.


తణుకులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

‘ఆడుదాం ఆంధ్ర’ను విజయవంతం చేయాలి

తణుకు టౌన్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 26 నుంచి నిర్వహిస్తామని ఈ పోటీలను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. ఆదివారం ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం చేయాలని కోరుతూ తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన 2 కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేల్పూరు గ్రామంలోని ఆదివారం సంత నుంచి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి గుడి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి గుడి సెంటర్‌లో మానవహారం నిర్వహించిన కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నమూనా ఉద్యోగులు, నాయకులు జట్లుగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జనవరి 9 వరకూ గ్రామ సచివాలయ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జనవరి 10 నుంచి మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని మొత్తం 140 బాలికలు, 140 బాలుర జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీలలో ప్రతీ ఒక్కరూ పాల్గొని తమ ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, ముళ్లపూడి బాబూరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యురాలు చుంద్రు శ్యామల, కార్యదర్శి వి.గంగాధరరావు, నాయకులు రెడ్డి సత్తిరావు, కె.సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

విజేతలు వీరే...

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని తణుకు మండల స్థాయిలో వేల్పూరులో ఆదివారం నిర్వహించిన 2కే రన్‌లో వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రావూరి వెంకట కార్తీక్ ప్రథమ, జలదాని వీరబాబు ద్వితీయ స్థానాలు సాధించినట్లు ఎంపీడీఓ తెలిపారు. విజేతలను ఎంపీపీ రుద్ర ధనరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు తదితరులు అభినందించారు.

చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు

పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పలు చర్చిల్లో ఆదివారం రాత్రి నుంచి క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ప్రసిద్ధి గూడెం టౌన్ ఎ.క్లాష్ లూథరన్ చర్చిలో సంఘ గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫినెహాస్ ఆధ్వర్యాన ప్రారంభ ప్రార్థన, సంధ్యారాధన కార్యక్రమం నిర్వహించారు. సండే స్కూలు విద్యార్థులు అభినయ గీతాలు ఆలపించారు. ప్రత్యేక స్కిట్స్ వేసి అలరించారు. పాలకవర్గ చైర్మన్ మానుకొండ భాస్కరరావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ట్రినిటీ ఆసుపత్రి అధినేతలు టీడీ భూషణ్ కుమార్, సునీల భూషణ్ కుమార్ ఆధ్వర్యాన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పీసీపీ, ఎల్‌సీసీ సంఘ సభ్యులు, స్త్రీలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముదునూరుపాడు బైబిల్ మిషన్ చర్చిలో సంఘ కాపరి, మిషన్ నాయకుడు ఎ.దైవారావు ఆధ్వర్యాన క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభం కాగా, భాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చిలో మల్లిపూడి జైబాబు, గూడెం బైబిల్ మిషన్ చర్చిల్లో రాజా ఎలీషా, మరనాత ఎలీషా, ఆనంద్ బెసలేల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు ప్రారంభించారు. రాచర్ల రూపాంతర దేవాలయం, చిన తాడేపల్లి షెకీనా బైబిల్ మిషన్ మందిరం, ప్రత్తిపాడు జీడీఎం చర్చి, పాతూరు, ప్రత్తిపాడు, మదర్‌వన్నిని ఆర్సీఎం చర్చిలతో పాటు, గూడెం మండలం బంగారుగూడెం, పట్టింపాలెం, కడియద్దలలో బైబిల్ మిషన్ చర్చిలు, ప్రత్తిపాడు, జువ్వలపాలెం, పెంటపాడు గ్రామాల్లో ఎల్ఎల్ఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వెంకట సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం: ప్రగతిశీల భావాలు కలిగిన కవిగా, నీతి, నిజాయతీతో పనిచేసిన ఉత్తమ రెవె న్యూ అధికారిగా, పేదప్రజల పక్షపాతిగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య చేసిన బహుముఖ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల గుంటూరులో కన్నుమూసిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్, కవి వెంకట సుబ్బయ్య సంస్మరణ సభ పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్ర ఆవరణలో ఆదివారం జరిగింది. కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకట సుబ్బయ్య రచనల్లో మినీ కవిత, నానీ, ప్రక్రియలుండేవన్నారు. ఆయన రచనలతో పలు సంకలనాలు ప్రచురణ అయ్యాయని, ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటన్నారు. ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ పాత్రికేయునిగా జీవితాన్ని ప్రారంభించిన వెంకట సుబయ్య సాహితీ లోకానికి విశేష సేవలు అందించారన్నారు. తహసీల్దార్‌గా ఇక్కడ పనిచేసిన వెంకట సుబ్బయ్య ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని మాజీ కౌన్సిలర్ యెగ్గిన నాగబాబు అన్నారు. పేదల కష్టాలు తెలిసిన అధికారిగా ఇక్కడ వెంకట సుబ్బయ్య పేరొందారని, అందుకే ఆయన పేరిట ఇక్కడ ఒక నగర్ ఏర్పాటు చేశారని సీపీఎం డివిజన్ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తెలిపారు. దుర్గా సతీష్, శిరిమామిళ్ల పెద్దిరాజు, అడ్డగర్ల వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, తాడికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.


సంస్మరణ సభలో పాల్గొన్న వక్తలు

10 మందికి ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 10 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు, ముద్దాపురం గ్రామాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి 10 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు కె.రామ్మోహనరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘గడప గడపకు’ నిధులతో మౌలిక వసతులు

ఆకివీడు: నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాల్ని వేగంగా కల్పిస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించే పక్కా డ్రెయిన్ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించామని చెప్పారు. అజ్జమూరు గ్రామంలో రూ.15 లక్షల గడపగడపకు నిధులతో, దాతల విరాళాలు రూ.25 లక్షల వ్యయంతో 1200 మీటర్ల మేర డ్రెయిన్ నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వానపల్లి బాబూరావు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, శింగులూరి నాగేశ్వరరావు, మంచ్యాల నానాజీ, తోట రాంబాబు, దుర్గారావు, సందన చిన్నా, ముత్యాల రామూర్తి, తోట సీతారామయ్య, జీ.ధనరాజు, షద్రక్, హుస్సేన్, కురెళ్ల పోలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

భీమవరం: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైఎస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అన్నారు. 2019–23 బ్యాచ్‌కు చెందిన 775 మంది బీటెక్, 2021–23 బ్యాచ్‌కు చెందిన 22 మంది ఎం.టెక్ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టార్టప్‌లపై దృష్టి సారించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ దేశాభివృద్ధికి దోహదపడాలని ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ పాల్గొన్నారు.

26న బాలల హృద్రోగ వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఉదయం పిల్లల్లో గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు బెస్ట్ అవార్డు


భీమవరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ వీరాస్వామి నుంచి బెస్ట్ సేఫ్ కేర్ సెంటర్ అవార్డు అందుకున్న దృశ్యం


తణుకు సేఫ్ కేర్ సెంటర్‌లో బాధితురాలికి ప్రొటీన్ బాక్స్ అందిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర చౌదరి

- ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అందిన పురస్కారం
- అత్యుత్తమ సేవలకు మంత్రి కారుమూరిచే సత్కారాలు

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు సత్వర, అత్యుత్తమ వైద్యసేవలందిస్తున్న తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు బెస్ట్ సేఫ్‌కేర్ సెంటర్ అవార్డుదక్కింది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఉన్న సేఫ్ కేర్ సెంటర్ ఈ అవార్డుద్వారా జిల్లాలో ముందువరసలో నిలిచింది. జిల్లాలో తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం సేఫ్‌కేర్ సెంటర్‌ల ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు వైద్యసేవలు అందుతుండగా ఈ ఏడాది డిశంబరు 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని జిల్లా స్థాయిలో తణుకు సేఫ్‌కేర్ సెంటర్ ఈ బెస్ట్ అవార్డుకు ఎంపికైంది. ప్రపంచ ఎయిడ్స్ దినం కార్యక్రమంలో భాగంగా భీమవరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్వరరావు చేతులమీదుగా సేఫ్‌కేర్ సెంటర్ ఉద్యోగి ఈ అవార్డును అందుకున్నారు.

సెంటర్‌కు బెస్ట్, సిబ్బందికి వ్యక్తిగత అవార్డులు

తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు బెస్ట్ అవార్డుతోపాటు సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న కౌన్సిలర్ ఎ.శ్రీనాథ్, ఫార్మసిస్ట్ డి.షర్మిల, ల్యాబ్ టెక్నీషియన్ కె.పురుషోత్తం, ఎఫ్‌సీ జె.జ్యోతి, ఐసీటీసీ కౌన్సిలర్ జి.నిర్మల బెస్ట్ అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రపంచ ఎయిడ్స్ దినం కార్యక్రమంలో పాల్గొని తన హయాంలో సేఫ్‌కేర్ సెంటర్‌కు బెస్ట్ అవార్డు రావడం ఆనందంగా ఉందంటూ వైద్యాధికారితో పాటు సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ప్రత్యేకంగా సత్కరించారు.

సెంటర్‌లో మందులు వాడుతున్న 3,989 మంది

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్‌కేర్ సెంటర్‌లో ఇప్పటివరకు 5,242 మంది హెచ్‌ఐవీ బాధితులు నమోదు కాగా ప్రస్తుతం 3,989 మంది బాధితులు మందులు వాడుతున్నారు. బాధితులకు మందుల పంపిణీతోపాటు బాధితులకు అండగా నిలిచే క్రమంలో దాతలను సేకరించి వారి సహకారంతో అనాథలుగా ఉన్న బాధిత చిన్నారులకు ప్రతినెలా పోషకాహారం పంపిణీ చేస్తుండగా, బాగా నీరసంగా ఉన్న వారికి ప్రొటీన్ బాక్స్‌లను నిత్యం అందిస్తుండడం వంటి సేవా కార్యక్రమాలకు తణుకు సేఫ్‌కేర్ సెంటర్ వేదికగా ఉంది.

సమిష్టి కృషే ఈ బెస్ట్ అవార్డు



తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు బెస్ట్ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో మా బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నాం. తణుకు సేఫ్‌కేర్ సెంటర్ ఉద్యోగులు ఎంతో క్రమశిక్షణగా, సమిష్టిగా విధులు నిర్వర్తించడంతోనే ఈ బెస్ట్ సేఫ్‌కేర్ అవార్డు మాకు దక్కింది. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ సెంటర్‌కు వచ్చిన బాధితులందరికీ ఎటువంటి జాప్యం లేకుండా మందులు అందిస్తున్నాం. మందుల కోసం రాని వారికి ఇళ్లకు కబురు పెట్టి మరీ మందులు వాడిస్తున్నాం. రోగుల్లో వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు నిబంధనలకు అనుగుణంగా సీడీ ఫోర్, వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించి దానికి తగ్గట్లుగా మందులు ఇస్తున్నాం. దీంతోపాటు రోగులకు హెపటైటీస్ వ్యాధి సోకకుండా ముందస్తుగా హెపటైటీస్ బి వ్యాక్సిన్ వేస్తున్నాం.

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ,
తణుకు సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి